## క్లుప్తంగా

### చలివేంద్రం ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ యాదయ్య ప్రారంభించారు. ప్రతిరోజు తాగునీరు అందిస్తామని అదేవిధంగా ఆదివారం పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం డిపో ఇన్‌చార్జ్ మాట్లాడుతూ సత్యసాయి బాబా చూపించిన సేవామార్గంలో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

### అంబలి కేంద్రం ప్రారంభం

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై సోమవారం మాజీ జెడ్పీటీసీ పబ్బు జంగయ్యగౌడ్ జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అతని కుమారుడు ఎంపీటీసీ చక్రవర్తిగౌడ్ అంబలి కేంద్రాన్ని ప్రారంభించి ప్రయాణికులకు అందజేశారు.

### పాలిసెట్ కోచింగ్‌కు రేపు మెరిట్ టెస్ట్

కొల్లాపూర్: పాలిసెట్ ఉచిత కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ ఓల్డ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్(కోసా) సంస్థ ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి కోరారు. ఈనెల 3న పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే మెరిట్ టెస్టుకు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని కోఠిలో శ్రీమేధ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్, హాస్టల్ వసతి, స్టడీ మెటీరియల్ ఇస్తామని వివరించారు. వివరాలకు సెల్: 9849713451 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### నవోదయ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ




ఉడుత సాయిసౌమ్య కర్నె హాసిని

కొల్లాపూర్: నవోదయ అర్హత పరీక్షలో పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలకు చెందిన ఉడుత సాయిసౌమ్య, గోమతి హైస్కూల్‌కు చెందిన కర్నె హాసిని ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా స్పందన కోచింగ్ సెంటర్ నిర్వాహకులను ఆయా ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

### బస్సులో వృద్ధురాలికి గాయాలు

తెలకపల్లి: అకస్మాత్తుగా బస్సుకు బ్రేక్ వేయడంతో వృద్ధురాలికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ప్రయాణికుల వివరాల ప్రకారం పెద్దపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు పార్వతమ్మ అనే వృద్ధురాలు సోమవారం పెద్దూరులో కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ఓ వృద్ధుడు అడ్డురావడంతో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. బస్సులో ఉన్న పార్వతమ్మ క్యాబిన్‌కు తగిలి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్లినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

### 4న మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన

అచ్చంపేట రూరల్: మండలంలోని బొల్గట్‌పల్లిలో మంగళవారం నుంచి గురువారం వరకు మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సేవ్యనాయక్, అధ్యక్షుడు సీతారాం నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనునట్లు పేర్కొన్నారు.

### మౌలిక వసతులు కల్పిస్తాం

లింగాల: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు మౌలికవసతులు కల్పిస్తామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. మండలంలోని అవుసలికుంట శివారులో కూలీలు చేస్తున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. వడదెబ్బకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, ఎఫ్‌ఏ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బల్మూర్: మండంలోని బిల్లకల్ నుంచి కొండనాగుల సమీపంలో సోమవారం అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకునట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. బిల్లకల్ గ్రామానికి చెందిన కొండల్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో మట్టిని సేకరించి ఫిల్టర్ ఇసుకను తయారు చేసి అక్రమంగా తరలిస్తున్నాడు. పోలీస్ సిబ్బంది ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకునట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

# ముమ్మరంగా మొక్కల పెంపకం

మండల వ్యాప్తంగా 23 నర్సరీలు



కోమటికుంటలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

లింగాల: పచ్చదనం పెంచేందుకు, అడవుల విస్తీర్ణం కోసం ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేసింది. వివిధ రకాల మొక్కలను పెంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుట, అటవీ ప్రాంతాలు, గుట్టలపై విత్తన బత్తులను విసురేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. వర్షాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేసేందుకు ఎప్పటికప్పుడు అధికారులు నర్సరీలను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 23 గ్రామ పంచాయతీలలో పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీలను ఏర్పాటు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీల నిర్వహణ కొనసాగుతోంది. వర్షాకాలం ప్రారంభం అయ్యేనాటికి మొక్కలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నం అయ్యారు.

**రెండు లక్షల మొక్కలు**

మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో దాదాపుగా 2 లక్షలకు పైగా మొక్కల పెంపకం చేపట్టారు. ఇందుకు గాను ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలలో వివిధ పనులకు నిధులను వెచ్చిస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో మొక్కల రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకున్నారు.

**147 ప్రదేశాలు ఎంపిక**

నర్సరీలలో పెంచుతున్న పలు రకాల మొక్కలను నాటేందుకు మండలంలో వివిధ ప్రాంతాలను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. కేఎల్‌ఐ కాల్వలు, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఈత వనాలు, పండ్ల తోటల పెంపకాలు, ఇండ్లలో పెంచుటకు అనువైన మొక్కలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలలో మొక్కల పెంపకం, 27 ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటేందుకు ఎంపిక చేశారు. టేకు, పీపీవీ, బీపీవీ తదితర రకాల మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఆయా ప్రదేశాలలో దాదాపుగా 1,16,250 మొక్కలను నాటుతామని అధికారులు తెలిపారు.

**మొక్కలను సిద్ధం చేస్తున్నాం**



వర్షాకాలం నాటికి హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం, మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేశాం. పలు రకాల మొక్కలను పెంచుతున్నాం. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పర్యవేక్షణలో నర్సరీలలో మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం.
– ఆంజనేయులు, ఎంపీడీఓ, లింగాల

## భక్తిశ్రద్ధలతో గణపతి పూజ



శాంతిగూడెంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

చారకొండ: మండలంలోని శాతిగూడెంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం మొదటి రోజు ఆలయంలో గణపతి పూజ, పుణ్యవాచనం, అఖండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. పురోహితులు మంత్రోచ్ఛరణాల మధ్య మూల మంత్ర హోమాలు, దేవతా హోమాలు, మంత్రపుష్పం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మంగళవారం మన్యూసూక్తం హోమాలు, ధాన్యాదివాసం, చతుర్థతి పారాయణం, బుధవారం ధ్వజ, నవగ్రహ, గ్రామ దేవతల, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన**

పెద్దకొత్తపల్లి: మండలంలోని చెన్నపురావుపల్లిలో ఆంజనేయస్వామి శివాలయం వద్ద సోమవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయాన్ని మామిడి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌రాజారావు, భక్తులు నీరేటి బిచ్చన్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూర్‌లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపు శిబిరంలో భాగంగా మూడోరోజు సోమవారం గ్రామస్తులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటు ప్రాధాన్యాన్ని వివరించారు. పార్లమెంట్ ఎలక్షన్‌లలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రామకృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కల్వకుర్తి బార్ అసోసియేషన్ కార్యవర్గం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సివిల్ కోర్టు నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, జనరల్ సెక్రటరీగా లక్ష్మణ్ రాజ్, జాయింట్ సెక్రెటరీగా ఆంజనేయులు, ట్రెజరీలుగా మల్లేష్, ప్రశాంత్, ప్రెస్ సెక్రెటరీగా రాంగోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చారకొండ: మండలంలోని జూపల్లిలో సోమవారం రైతువేదిక కార్యాలయంలో సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరాఉ. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకం రూ. 2203, సాధారణ రకం రూ.2183లు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతుల ఖాతాలో నగదును బదిలీ చేస్తుందన్నారు. ధాన్యం దళారులకు విక్రయించకుండా కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో సీఈఓ వెంకటయ్య, బీమయ్య, ఏఈఓ సుష్మ, రైతులు భిక్షపతి, నిరంజన్, సైదులు, శివ, కనకచారి తదితరులు ఉన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



గ్రంథాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లిలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్, అచ్చంపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ఈ నెల 5న ఆచార్య ప్రభోధానంద యోగేశ్వర జన్మదినం సందర్భంగా గ్రంథాలను పంపిణీ చేసినట్లు ఆ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు సాయిశంకర్, శ్రేష్టి, మనోహర్, వెంకటయ్య, నరసింహ, నిరంజన్, స్వప్న, మంజుల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కొల్లాపూర్: చింతలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్లు భారతి, సుగుణలను విధుల నుంచి తొలగించడం సరైంది కాదని, వెంటనే వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాజకీయ కక్షల కారణంగా అంగన్‌వాడీ టీచర్లను తొలగించారని వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకులు రమాదేవి, పద్మ, సువర్ణ, రామచంద్రమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డుదారులకు ప్రతి నెల 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు అందించేందుకు చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ యూసుఫ్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని అన్ని రేషన్‌దుకాణాలకు బియ్యాన్ని పంపిణీ చేశారు. 15 తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

### విద్యార్థికి సన్మానం



లింగాల: మండలంలోని దత్తారం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి జి.హరీష్ సైనిక్ పాఠశాలకు ఎంపికయ్యాడు. అర్హత పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబర్చి కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం నస్రీన్ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థి హరీష్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగమ్మ, నిరంజన్, మల్లేష్, రాములు, రాజేష్, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్ తరలిన కాంగ్రెస్ నాయకులు

వీపనగండ్ల: నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న బూత్ లెవల్ ఏజెంట్ల రాజకీయ శిక్షణ కార్యక్రమానికి సోమవారం మండలంలోని నాయకులు అధిక సంఖ్యలో బయలుదేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు రవిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని, ఎన్నికల విధానంపై అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్, హుస్సేన్, పెంటయ్య, నరేష్, మల్లేష్, గురుక కురుమయ్య, తిరుపతయ్య, వెంకటేష్, రాజు, మొగులాలి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ కమిటీ సభ్యులకు నిర్వహించే శిక్షణకు సోమవారం మండలం నుంచి నాయకులు వెంకటేష్‌నాయుడు, రవికుమార్, రాముయాదవ్, బ్రహ్మయ్య, ప్రజా ప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తరలివెళ్లారు.

## చిన్నారులకు బాలామృతం పంపిణీ



రంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్న టీచర్ చంద్రకళ

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారం పంపిణీ చేశారు. తూంకుంట, రంగవరం, వీపనగండ్ల, సంగినేనిపల్లి తదితర గ్రామాల్లో గుడ్లు, బాలామృతాన్ని లబ్ధిదారులకు అందజేశారు. తూంకుంట మొదటి అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రకళ, పారిజాత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## బావులను పరిశీలించిన అధికారులు



రామతీర్థంబావిని పరిశీలిస్తున్న అధికారులు

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో కొన్ని రోజుల నుంచి తాగునీటి సమస్య తలెత్తింది. ప్రత్యేక అధికారి విజయ్‌గౌడ్, మిషన్ భగీరథ ఏఈ రవి, పంచాయతీ సెక్రెటరీ అశ్వినిలు సోమవారం గ్రామంలోని బోర్లు, బావులను పరిశీలించారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరించేవిధంగా చూడాలని మిషన్ భగీరథ ఏఈని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధ్యక్షుడు డబ్బ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘించొద్దు



చారకొండలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి

చారకొండ: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించొద్దని ఎవరైనా విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఏఆర్‌ఏ డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని నిబంధనలకు విరుద్ధంగా నగదును, ఇతర విలువైన వస్తువులను తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. తనిఖీలో హెడ్‌కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, ముత్యాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కనీస వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం



కాంసానిపల్లి శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆంజనేయులు

ఉప్పునుంతల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సి ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కాంసానిపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో సందర్శించిన ఆయన కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేసిన పనులకు సకాలంలో కూలీ డబ్బులు ఇవ్వడం లేదుని కూలీలు వాపోయారు. అనంతరం ఆంజనేయులు ఉపాధి హామీ చట్టంలో నిర్దేశించిన విధంగా కూలీలకు ఏమాత్రం వసతులు కల్పించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్టు తదితర వసతులను కూడా పనుల వద్ద సమకూర్చడంలేదని అన్నారు. కూలీలకు గడ్డపార, పార, తట్ట వంటి పరికరాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రతి కుటుంబానికి 200ల రోజులు పనిదినాలు కల్పించడంతోపాటు రోజుకు గిట్టుబాటు కూలీ రూ. 600లు అందజేయాలని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు, మండల నాయకులు రాములు, అర్జున్, శ్రీనివాసులు, నిరంజన్, తిర్పతయ్య, సాయిబాబు తదితరులు, కూలీలు పాల్గొన్నారు.

## పనిచేసిన వారికి సముచిత స్థానం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

చారకొండ: పార్టీ బలోపేతానికి పనిచేసిన నాయకులను, కార్యకర్తలను పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని మర్రిపల్లిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అందరు కృషి చేయాలని సూచించారు. అనంతరం మర్రిపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జర్పటి కొండల్, ఉపాధ్యక్షుడిగా నూనె విష్ణు, కృష్ణారెడ్డి, కార్యదర్శిగా నూనె శ్రీనయ్య, విజేందర్ రెడ్డి, ఇన్‌చార్జ్ అంగోతు రాజు, యూత్ అధ్యక్షుడిగా రాజులు ఎన్నికయ్యారు. అదేవిధంగా యూత్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం బాల్‌రాంగౌడ్ నూతన కమిటీకి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో పీడర్ చానల్ పనులను ఎంపీడీఓ జ్యోతిపరోసియా, ఏపీఓ చంద్రసిద్ధార్థలు సోమవారం పరిశీలించారు. పనుల వివరాలు, ప్రదేశాల వద్ద పాల్గొనే కూలీలకు అన్నిరకాల వసతులను ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు చేశారు. కూలీలు ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ఉదయమే 8 గంటల నుంచి 12 గంటలకు వరకు ముగించాలన్నారు. ఆ తర్వాత 3 గంటల నుంచి 6 గంటలలోపు పనులను ముగించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛభారత్



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న సభ్యులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. స్వామివివేకానంద సేవాబృందం, నెహ్రూయువ కేంద్ర ఆధ్వర్యంలో సభ్యులు, వలంటీర్లు పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో శివ, చింటు, గౌతం, హర్షిత్, హాషు, చందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో యూనిఫాం అందజేస్తాం



మేడిపూర్ కొలతలు తీసుకుంటున్న మహిళా సభ్యులు

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో ఉచితంగా యూనిఫాం అందజేస్తామని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు 37 పాఠశాలలు ఉన్నాయని ఆయా పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే యూనిఫాం కుట్టేందుకు మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పజెప్పిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



బలరాంకృష్ణారావుకు సన్మానిస్తున్న డీఈఓ

పెంట్లవెల్లి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని డీఈఓ గోవిందరాజులు అన్నారు. సోమవారం మండల కేద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం బలరాంకృష్ణారావు పదవీవిరమణ సన్మాన సభకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

**అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు**

వెల్దండ: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు వెంకటయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై సన్మానించారు. హెచ్ఎం చంద్రుడు, నాయకులు చిన్నయ్య, రాజేందర్, నాగభూషణం, ఉపాధ్యాయులు ఉన్నారు.

### భ్రమరాంబ ఆలయ కమిటీ ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భ్రమరాంబ దేవాలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా సతీష్ కుమార్, కోశాధికారిగా వెంకటేషలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

